క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా యువజనాధికారి మహేంధర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి మహేంధర్‌రెడ్డి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటును వినియోగించడం బాధ్యతగా భావించాలన్నారు. యువత, విద్యార్థులు ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చిరంజీవి, ఎన్‌వైకే వలంటీర్లు వినయ్, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

ముత్తుకూరు : ముత్తుకూరులో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని వాజ్‌పేయ్, శ్రీసీతారాముల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వేళపాళెం సంపత్‌రెడ్డి, సీనియర్ నేతలు ఆంజనేయరెడ్డి, దయాకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఈశ్వరరెడ్డి, రమణారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాలెండర్ ఆవిష్కరణ



కోవూరు : స్థానిక గ్రంథాలయంలో పచ్చిపాల శంకర్‌రెడ్డి ట్రస్టు కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి రూపొందించిన ప్రత్యేక సోలార్ క్యాలెండర్‌ను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ఎంతో కాలం రీసెర్చ్ చేసి సోలార్ క్యాలెండర్‌ను రూపొందించినట్లు తెలిపారు. దీనిని బుధవారం ఢిల్లీలోని వరల్డ్ బుక్‌షోలో కూడా ప్రదర్శించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, శేఖర్‌స్వామి, సీనియర్ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



కోవూరు : మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు గురువారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన విషయం విదితమే. ఈ మేరకు వారు గత మూడు రోజులుగా గ్రామంలో తిరుగుతూ కోళ్లను తీసుకురావడం, వాటిని సంచుల్లో వేసి పాతివేయడం వంటి పనులు చేశారు. దీంతో వారికి వ్యాధి సంక్రమించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా వైద్యపరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, ఢిల్లీ నుంచి వచ్చిన కమిటీ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



పట్టణ నడిబొడ్డున నిర్మించిన రైతుబజార్



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

చూడచక్కని రైతుబజార్

- అన్ని వసతులతో పొదలకూరు పట్టణంలో నిర్మాణం
- చుట్టుపక్కల రైతులకు, స్థానికులకు ఎంతో మేలు

ఇది కదా.. అభివృద్ధి



వ్యాపారం చేసుకునేందుకు వృద్ధురాలికి అనుమతి పత్రం ఇస్తున్న మంత్రి కాకాణి(ఫైల్)

పొదలకూరు : మార్కెటింగ్ శాఖ ద్వారా పొదలకూరు పట్టణ నడిబొడ్డులో రైతు బజార్‌ను నిర్మించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయశాఖతో పాటు మార్కెటింగ్‌శాఖను కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణం వేగవంతం చేశారు. దీంతో గతేడాది సెప్టెంబరులో స్టేట్ మార్కెటింగ్‌శాఖ సీఈఓ నందకిశోర్‌రెడ్డితో కలిసి మంత్రి కాకాణి రైతుబజార్‌ను ప్రారంభించారు. దీంతో బజారులో తాజా కూరగాయలు లభ్యం అవుతున్నాయి. అంతేకాక బహిరంగ మార్కెట్ కంటే ఇక్కడ తక్కువకు కూరగాయలు, పండ్లు లభ్యం అవుతున్నట్టు వినియోగదారులు వెల్లడించారు. రూ.45 లక్షలతో బజార్ నిర్మాణం చేపట్టి ఇందులో వ్యాపారాలు చేసుకునే వారితో పాటు బజార్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లను కూడా నిర్మించారు. మొత్తం 20 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం చేపట్టి వీటిలో ఇప్పటికే కొన్నింటిని చుట్టుపక్కల గ్రామాల చిరువ్యాపారులకు కేటాయించారు. నాలుగు గదులను నిర్మించి వాటిని మరికొందరు వ్యాపారులకు కేటాయించాల్సి ఉంది. ఫలితంగా మహిళలు ఎలాంటి వ్యవప్రయాసలు లేకుండా మెయిన్ సెంటరులో ఉన్న రైతుబజార్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసుకునేందుకు అనుకూలంగా ఉంది.

పొదలకూరు రైతుబజార్

వ్యయం	ప్లాట్‌ఫామ్‌లు
రూ.45 లక్షలు	20

పూర్తిస్థాయిలో వసతులు

"రైతుబజార్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాం. మిగిలిన ప్లాట్‌ఫామ్‌లు, గదులను కేటాయించాల్సి ఉంది. కొందరు కావాలని అడుగుతున్నారు. పరిశీలించి ప్లాట్‌ఫామ్‌లను కేటాయించాం.

– డి.నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెటింగ్ సెక్రటరీ, పొదలకూరు

సౌకర్యంగా ఉంది



"ప్రస్తుత రైతుబజారులో సౌకర్యంగా ఉంది. ఇప్పుడిప్పుడే వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. బయటి మార్కెట్‌కు ఇక్కడ ధరలకు తేడా ఉంటుంది. తాము పండించిన కూరగాయలను ఎక్కువగా తీసుకొచ్చి సరసమైన ధరలకు విక్రయిస్తుంటాం.

– గంగమ్మ, వ్యాపారి, పొదలకూరు

ఇబ్బందులు లేవు



"వ్యాపారం పెరిగితే లాభాలు పెరుగుతాయి. ప్రస్తుతం వ్యాపారం ఇబ్బంది లేకుండా జరుగుతోంది. ఇక్కడ బజార్ నిర్మించడం వల్ల ప్రజలతో పాటు వ్యాపారులకు కూడా మేలు జరిగింది. గ్రామంలో పండించిన కూరగాయలను ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం.

– మహేశ్వరీ, వ్యాపారి, మర్రిపల్లి

ఫేక్ ప్రచారాలకు కేరాఫ్ సోమిరెడ్డి



మంత్రి కాకాణితో పులతీగలపాడు గ్రామస్తులు

వెంకటాచలం : సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలంటూ ఫేక్ ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్‌గా సోమిరెడ్డి మారిపోయాడు. తాజాగా ఆయన ఫేక్ ప్రచారం మండలంలోని కసుమూరు పంచాయతీ పులతీగలపాడులో రుజువైంది. ఇటీవల పులతీగలపాడులో పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలంటూ సోమిరెడ్డి సోషల్ మీడియా గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం చేసుకున్నాడు. అయితే ఆ పది కుటుంబాలు బుధవారం నెల్లూరు నగరంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తామంతా టీడీపీలో చేరలేదని వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. తమను సోమిరెడ్డి ప్రలోభపెట్టి టీడీపీలో చేరినట్లుగా ప్రకటించుకున్నాడని, ఇందులో వాస్తవం లేదని స్పష్టం చేయడంతో మరోసారి ఫేక్ ప్రచారాలతో సోమిరెడ్డి నవ్వులపాలయ్యాడు.

కస్తూర్బా గాంధీకి ఘన నివాళి



కస్తూర్బా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు, చిన్నారులు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో మహాత్మా గాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంధర్‌రెడ్డి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాపూజీ బాటలో నడుస్తూ మహిళల్లో చైతన్యం నింపినట్లు తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో కారాగార శిక్ష కూడా అనుభవించారన్నారు. స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడంలో కస్తూర్బా తన వంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీజీ, స్థల దాత కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో జేసీ పరిశీలన



వసతులపై ఆరాతీస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కోవూరు : మండలంలోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం ఉదయం పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా మండలాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రామాంజనేయులు, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, ఆర్‌ఐ రమణయ్య, ఎంఈఓ రహీమ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



వృద్ధురాలికి అసైన్‌మెంట్ పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేసినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులోని రుక్మిణి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వంద సంవత్సరాలుగా ఉన్న చుక్కల భూముల సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. అంతేకాకుండా అసైన్మెంట్ భూములకు పట్టాలు అందించినట్లు వివరించారు. దీనివల్ల ఎందరో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ చెప్పారంటే చేస్తారని, ఆయనకు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. తొలుత కోవూరు మండలంలోని పాటూరు, గంగవరం, ఇనమడుగు, పడుగుపాడు, లేగుంటపాడు గ్రామాలకు సంబంధించిన రైతులకు అసైన్మెంట్ భూముల పట్టాలను పంపిణీ చేశారు. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన బి.శేషమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సహకార సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో లక్షల మందికి ఉద్యోగాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కాకాణి, యువత

వెంకటాచలం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో ఐదు లక్షల మందికిపైగా ఉద్యోగాలు కల్పించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న బ్రిడ్జ్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని యువకులతో 'యువకెరటం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అయ్యప్ప గుడి సెంటర్ నుంచి కల్యాణ మండపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాబోయే రెండు నెలలు చాలా కీలకమైనవని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడంలో యువత చాలా కీలకపాత్ర పోషించాలని సూచించారు. యువత సమష్టిగా పనిచేస్తే వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందన్నారు. ప్రతిపక్షాల కుట్రలు, ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు తేడాను ప్రజలకు వివరించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే వ్యక్తి జగనన్న అని, ప్రజలను ఏదోలా మోసం చేసి అధికారం కోసం అర్రులు చాచే నీచుడు చంద్రబాబు అని విమర్శించారు.

జనం కోసం నేను... ధనం కోసం సోమిరెడ్డి

సర్వేపల్లి నియోజకవర్గంలో జనం కోసం నేను పని చేస్తుంటే ధనం కోసం సోమిరెడ్డి పని చేస్తున్నాడని మంత్రి కాకాణి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త కంపెనీ వస్తే స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేందుకు తాను కృషి చేశానని, పోరాటం పేరుతో సోమిరెడ్డి కంపెనీల వద్దకు వెళ్లడం, యాజమాన్యాలు ఇచ్చే సొమ్ముతో తనతో వచ్చిన వారిని తాకట్టు పెట్టడమే దినచర్యగా మార్చుకున్నాడన్నారు. రాబోయే ఎన్నికల్లో సోమిరెడ్డికి చంద్రబాబు టికెట్ ఇస్తాడనే గ్యారంటీ లేకపోవడంతో, టీడీపీలో చేరికలంటూ ఫేక్ ప్రచారాలకు సోమిరెడ్డి దిగజారి పోయాడన్నారు. సీఎం కార్యాలయ చీఫ్ ట్రైనర్ చిరంజీవి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణిని గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన యువకులు

ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు

మనుబోలు : ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ముందుకు సాగాలని ఆ సంఘ మండలాధ్యక్షుడు కృష్ణచైతన్య అన్నారు. మనుబోలు మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా నేత అమర్తలూరు చెంచయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ఏకమై తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. ఈనెల 25న పొదలకూరులో ఆర్యవైశ్య సంఘ సమావేశం జరుగుతుందని తెలిపారు. అందులో నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సంఘ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘ సభ్యులు ఓలేటి సురేష్, కామిశెట్టి భార్గవ్, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టోత్సవం



పూజల్లో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కొడవలూరు: మండలంలోని గండవరం గ్రామంలో శ్రీదేశమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టోత్సవం గురువారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు పెనాక శ్రీనివాసులురెడ్డి కుమారుడు పెనాక అక్షయ్‌రెడ్డి(ఎన్‌ఆర్ఐ) సొంత నిధులతో గ్రామ శివారులో శ్రీదేశమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, వాసిపల్లి వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీత్యాగరాజ కల్యాణ మండపం కమిటీ, శ్రీసీతారామస్వామి మందిర కమిటీ నిర్వాహకులు తెలిపారు. బాలాజీనగర్‌లోని శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో గురువారం ఆరాధనోత్సవం ఆహ్వాన పత్రికలను కమిటీ కార్యదర్శి మోహన్‌రావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు గుప్తా, ఆంజనేయులు, సహాయ కార్యదర్శి వెంకటరత్నం, సభ్యులు మస్తాన్‌రావు, స్వామి పూర్ణచంద్రరావు, సంగీత విద్వాంసురాలు లక్ష్మీకామాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామిని స్మరిస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

3న మాదిగల రాజకీయ గర్జన

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ మార్చి 3న నిర్వహిస్తున్న మాదిగల రాజకీయ గర్జనను జయప్రదం చేయాలని మన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ పిలుపునిచ్చారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్లూరు కొండాయపాళెం గేటు సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సభకు జిల్లా నలుమూలల నుంచి మాదిగ సంఘీయులు, ఉద్యోగ సంఘాల నేతలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలి



కమ్మపాళెంలో రైతుల ఈ–కేవైసీని పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : పంట నమోదు పూర్తయిన రైతులు వెంటనే ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలిక ఆర్బీకేలను ఆమె గురువారం సందర్శించి పంట నమోదు, ఈ–కేవైసీలను పరిశీలించారు. పంట నమోదైన రైతుల్లో పలువురు ఈ–కేవైసీ చేయించుకోలేదన్నారు. ఇది కూడా పూర్తయితేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. ఈ–కేవైసీని ఫోన్‌లో ఓటీపీ ద్వారా లేదా వేలిముద్ర ద్వారా చేయించుకునే వెసులుబాటు ఉందన్నారు. రైతులకు సులభమైన పద్ధతిలో ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట వీఏఏలు సుజిత్, నవీన్, రైతులు ఉన్నారు.

నేడు పీజీపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరం శుక్రవారం నిర్వహిస్తామని వైద్యాధికారి నరసింహారావు గురువారం తెలిపారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తామన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



తోటపల్లిగూడూరు : మండలంలోని నరుకూరులో ఉన్న ఎయిమ్స్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఈ క్రమంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పీవీ రమణమూర్తి, హెచ్‌ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయ కమిటీ మెంబర్ లక్ష్మీ పాల్గొన్నారు.